క్లుప్తంగా

ఓటింగ్‌పై మహిళలకు అవగాహన



పెంకేవారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గులేసి ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తాళ్లరేవు: మండలంలోని పెంకేవారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఎన్నికల ఓటింగ్ విధానంపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిభావని మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం వంటిదని ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు ఓటింగ్‌పై అవగాహన పెంచుకుని ఉత్తమ ఆశయాలు కలిగిన వ్యక్తులను ఎన్నుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఘనంగా అరుణ హోమం



సౌర విశిష్టతను వివరిస్తున్న యాగకర్త రామకృష్ణశర్మ

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో నిర్వహిస్తున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌర యాగంలో 20వ రోజు గురువారం అరుణ హోమం ఘనంగా నిర్వహించారు. యాగకర్త ముస్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ఋత్విక బృందం చిత్త నక్షత్ర జాతకులచే మారేడు చెట్టుకు పూజలు చేయించారు. దీంట్లో భాగంగా గోపూజ, ఆదిత్య పఠనం, త్రిచపూజ నిర్వహించారు. అనంతరం యాగకర్త సౌర విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గురుకుల పాఠశాలలో సైన్స్ దినోత్సవం



సైన్స్ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంఈఓ జి.ఉదయభాస్కర్

ముమ్మిడివరం: మండలంలోని ఠానేల్లంక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వికసిత భారత్ కోసం స్వదేశీ సాంకేతికత అనే అంశంపై విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు, పలు రకాల ప్రాజెక్టులు, సైన్స్ స్కిట్స్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యాధికారి–2 జి.ఉదయ భాస్కర్ మాట్లాడుతూ యువతలో విజ్ఞానాన్ని పెంపొందించడమే సైన్స్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



భీమనపల్లిలో ఆర్‌ఓ ప్లాంటును పరిశీలిస్తున్న ఏపీసీ మధుసూదనరావు

ఉప్పలగుప్తం: పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని సమగ్ర శిక్షా ఎడిషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు అన్నారు. మండలంలోని భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతి పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్లను మరమ్మతులు చేయించాలని, దీనికి సంబంధించి ప్రత్యేక నిధులు ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వరరావు, పీడీ కామన మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

మహాగర్జన వాల్‌పోస్టర్ల విడుదల

అమలాపురం రూరల్: ఏపీ రాష్ట్ర గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మార్చి 3వ తేదీన విశాఖపట్టణంలో జరిగే మహా గర్జనను విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు వెంకన్నబాబు, శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం మహాగర్జన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు.

అన్నదాతలకు కొండంత అండ



అమలాపురం కలెక్టరేట్‌లో రైతులకు సున్నా వడ్డీ నిధుల చెక్కును అందజేస్తున్న జేసీ నుపూర్ అజయ్



వరి నాట్లు వేస్తున్న రైతు కూలీలు

- రైతులకు సాయంగా వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం
- ముమ్మిడివరం నియోజకవర్గంలో 2,793 మందికి సాయం

అమలాపురం రూరల్/ముమ్మిడివరం: పేద, అట్టడుగు వర్గాలకు చెందిన రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఏడాదికి రెండు విడతలుగా ఆర్థిక సహాయం అందిస్తోంది. రైతులు తీసుకున్న రుణాలపై ప్రభుత్వం వడ్డీ రాయితీ అందిస్తుండడంతో లక్షలాది మంది ప్రయోజనం పొందుతున్నారు. గతంలో పంట సాగుకు పెట్టుబడుల రూపేణా రైతులు అప్పులు తీసుకోవాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం అన్నివిధాలా అందిస్తున్న సహాయం రైతులకు పెట్టుబడిగా దోహదపడుతోంది.

2,793 మంది రైతులకు వడ్డీ రాయితీ

ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి మూడు విడతల్లో కలిపి రూ.12,500 ఆర్థిక సహాయం అందజేస్తుంది. ఖరీఫ్, రబీ సాగు ప్రారంభానికి ముందే ఆర్థిక సహాయం అందిస్తూ రైతులకు ప్రభుత్వం ఎంతో అండగా నిలుస్తోంది. వ్యవసాయం దండగ కాదు పండగ అనేలా కౌలు రైతులకు సైతం రైతు భరోసా పథకం ద్వారా సహాయం చేస్తుంది. దీనికి తోడు వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీతో అదనపు సాయం అందజేస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేశారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి అమలాపురం నియోజకవర్గ పరిధిలో 2843 మంది రైతులకు రూ.43.09 లక్షలు, ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో 2793 మంది రైతులకు రూ.45.01 లక్షల మేర సున్నా వడ్డీ రాయితీగా రైతులకు లబ్ధి చేకూరింది. రెండు నియోజకవర్గాల్లోనూ కలిపి మొత్తంగా 5,636 మంది రైతులకు మేలు జరిగింది. గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ ఇంతగా రైతులకు ఆర్థిక సహాయం అందించిన దాఖలాలు లేవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సున్నా వడ్డీ రాయితీతో మేలు



ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ పథకం ద్వారా సాయమందిస్తూ రైతులకు ఎంతో మేలు చేస్తుంది. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ఏటా ఎలాంటి ఆటంకం లేకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– కర్రి సత్యనారాయణ, రైతు, కర్రివానిరేవు

క్రమం తప్పకుండా సాయం



మేము తీసుకున్న అప్పులపై వడ్డీ రాయితీ సొమ్ము ఏటా క్రమం తప్పకుండా మాకు ఇస్తున్నారు. ఖరీఫ్‌తో పాటు రబీ సాగులో పెట్టుబడులకు అప్పులు చేయాల్సిన పని లేకుండా ప్రభుత్వం అందిస్తున్న సాయం ఉపయోగపడుతుంది. ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటూ వ్యవసాయం చేసే రైతులకు భరోసా కల్పిస్తుంది.

– కె.శ్రీనివాసరావు, రైతు, గాడిలంక

బాలికలను ఉన్నత చదువులు చదివించాలి



బేటీ బచావో, బేటీ పఢావో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: తల్లిదండ్రులు ఆడపిల్లలకు నాణ్యమైన విద్యను అందించి ఉన్నత చదవులు చదివించడం ద్వారా అన్ని రంగాల్లోనూ రాణిస్తారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. గురువారం ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో యానాంలో బేటీ బచావో, బేటీ పఢావో నినాదంతో వివిధ పాఠశాలల బాలికలతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌ఏఓ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అశోక్ ర్యాలీనుద్దేశించి మాట్లాడుతూ సమాజంలో భ్రూణహత్యలతో బాలల లింగ నిష్పత్తిలో తీవ్ర వ్యత్యాసం కనిపిస్తుందని, ఈ ధోరణి ప్రమాదకరమైందన్నారు. జనాభా గణనలో బాలుర కంటే బాలికల సంఖ్య తగ్గినట్లుగా స్పష్టమవుతుందని చెప్పారు. అందుకే కేంద్ర ప్రభుత్వం బాలికల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్‌ఐలు మురుగునాథన్, శేరు నూకరాజు, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు కొనసాగాలంటే జగనన్న ప్రభుత్వమే రావాలి



సీతారామపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాదా గోవిందకుమార్

తాళ్లరేవు: ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ యథావిధిగా కొనసాగాలంటే రాష్ట్రంలో తిరిగి జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలని పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ అన్నారు. గురువారం కోరంగి పంచాయతీ పరిధిలోని సీతారామపురంలో ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెయ్యల మంగేష్, నాయకులు పెయ్యల శ్రీనివాస్, పెంకే రామకృష్ణ, గెద్దాడ బూరియ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ కూలర్ బహూకరణ



కనకాలపేట ప్రభుత్వ హైస్కూల్‌కు వాటర్ కూలర్ బహూకరణ

యానాం: నియోజకవర్గ పరిధిలోని కనకాలపేట కామిశెట్టి శ్రీపరశురామ వరప్రసాదరావు నాయుడు ప్రభుత్వ హైస్కూల్‌కు అదే గ్రామానికి చెందిన పోలిశెట్టి నర్సింహమూర్తి కుమారుడు నరసయ్య(బాబ్జి) వాటర్ కూలర్‌ను బహూకరించారు. 80 లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్‌కూలర్‌ను ఉపాధ్యాయులకు గురువారం అందజేశారు. ఈ వేసవిలో విద్యార్థులు చల్లని నీరు తాగాలనే ఉద్దేశంతో వాటర్ కూలర్‌ను బహూకరించినట్లు దాత నరసయ్య తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు దాతను నరసయ్యను, ఆయన తండ్రి నర్సింహమూర్తిని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం



వలంటీర్లను సత్కరిస్తున్న కౌన్సిలర్ సత్యలక్ష్మి, రవిశంకర్ తదితరులు

అమలాపురం టౌన్: పట్టణంలోని 19, 20 వార్డుల సచివాలయంలో ఇటీవల వలంటీర్లకు వందనం పురస్కారాలు అందుకున్న 18 మంది వలంటీర్లను గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి, పట్టణ వైఎస్సార్ సీపీ నాయకుడు చిక్కాల రవిశంకర్‌లు మాట్లాడుతూ వార్డుల్లో వలంటీర్లు అందరితో కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారంటూ కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు అందించడంలో నీతి నిజాయతీతో పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పొలమూరు ప్రవీణ్, ఊటాల వెంకటేష్, గున్నేపల్లి భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

యానాం: నియోజకవర్గ పరిధిలో ఇంటర్మీడియట్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మార్చి 1 శుక్రవారం నుంచి 15వ తేదీ వరకూ పరీక్షలు జరగనున్నాయి. యానాంలో రీజెన్సీ, సాయి, ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, రవి కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి గాను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగే పరీక్షలకు సుమారు 1000 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. 60 మంది ఇన్విజిలేటర్లు పరీక్షలు ఎలా జరుగుతున్నాయో పర్యవేక్షించనున్నారు. జంబ్లింగ్ పద్ధతి అనుసరిస్తుండటంతో తాళ్లరేవు మండల పరిధిలోని చొల్లంగిపేట గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులకు యానాం రీజెన్సీ సెంటర్‌ను పరీక్ష కేంద్రంగా ఇచ్చారు. దీంతో ఈ సెంటర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి ఆలయ ప్రతిష్ఠ



మామిడికుదురులో నిర్వహిస్తున్న శాంతి కల్యాణం

మామిడికుదురు: స్థానిక వాసంశెట్టివారిపాలెం హైసూల్ రోడ్డులో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయం విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. మాఘ బహుళ పంచమి 9.50 గంటలకు స్వాతి నక్షత్రయుక్త మేష లగ్నంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. వాసంశెట్టి సత్యనారాయణమూర్తి అతని కుమారుడు వెంకటరమాకాంత్‌బాబు, కవిత దంపతులతో ఈ పూజలను ఘనంగా జరిపించారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ జాయింట్ సెక్రటరీ వాసంశెట్టి సత్యనారాయణమూర్తి, మట్టపర్తి త్రిమూర్తులు, గంగారత్నం దంపతులు, వాసంశెట్టి వెంకట్రావు, ఓలేటి సత్యం ఆధ్వర్యంలో వేద పండితుల పర్యవేక్షణలో ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు, హోమం, పూర్ణాహుతి, అనంతరం ప్రతిష్ఠ కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల నడుమ వేద పండితుల ఘనంగా జరిపించారు. తదుపరి శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

ఈవీఎంలపై ఉద్యోగులకు శిక్షణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మేరికమ్మ

మామిడికుదురు: ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై మహిళా ఉద్యోగులకు గురువారం మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ ఎం.మేరికమ్మ మాట్లాడుతూ ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ పని చేస్తుందన్నారు. దానికి అనుగుణంగానే ఉద్యోగులు కూడా పని చేయాలన్నారు. ఈవీఎంల ఆపరేటింగ్, వీవీ ప్యాట్ల పనితీరుపై మహిళా ఉద్యోగులకు సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఎటువంటి సమస్య ఏర్పడినా వారితో సంప్రదించాలని తహసీల్దార్ సూచించారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలకు ప్రధానంగా శిక్షణ ఇచ్చారు. మండలంలోని 88 మంది మహిళా ఉద్యోగులతో పాటు ఎంఈఓ లక్ష్మీనారాయణ ఈ శిక్షణలో పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి

పి.గన్నవరం: ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించుకుని కచ్చితంగా పాటించాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని పీఓలు, ఏపీఓలు, ఎన్నికల విధుల్లో పాల్గొనే మహిళా ఉద్యోగులకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై ఆయన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నియమావళి, చాలెంజ్ ఓటు, టెండర్ ఓటు తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. తహసీల్దార్లు ప్రమద్వార్, ఎం.మేరికమ్మ, ఇన్‌చార్జి తహసీల్దార్ దేవళ్ల శ్రీనివాస్, డీటీ బి.గోపాల కృష్ణ, ఎంఈఓ కోన హెలీనా తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



పినపళ్లలో రైతులను కలసి అభిప్రాయాలను తెలుసుకుంటున్న వ్యవసాయశాఖాధికారులు

ఆలమూరు: మండలంలోని ఆలమూరు, జొన్నాడ, పినపళ్ల, పెదపళ్ల గ్రామాల్లో జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు నేతృత్వంలోని అధికారుల బృందం గురువారం పర్యటించింది. రబీ సాగుపై రైతులను అభిప్రాయాలను తెలుసుకుని సూచనలు, సలహాలు అందజేశారు. సీజన్‌లో సంభవిస్తున్న వివిధ తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అధిక దిగుబడి, పెట్టుబడి ఆదాకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. రైతులకు ఆర్బీకేల ద్వారా కల్పిస్తున్న సౌకర్యాలు, సదుపాయాలను, గిట్టుబాటు ధరను కల్పిస్తున్న విధానాన్ని వివరించారు. వరిసాగు ఈనిక దశలో ఉన్నందున రైతులందరూ ఎప్పటికప్పుడు గ్రామ క్షేత్ర సహాయకుల సూచనలు, సలహాలను స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పంటకోత ప్రయోగాల ద్వారా పంట దిగుబడిని అంచనా వేస్తున్నామన్నారు. ఏడీఏ కె.నాగేశ్వరరావు, ఏఓ ఎస్.లక్ష్మీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులపై అవగాహన ఏర్పరచుకోవాలి

కొత్తపేట: బ్యాంకులు, బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరచుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) శ్యాంబాబు సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకూ 'ఫైనాన్సియల్ లిటరసీ వీక్' పురస్కరించుకుని రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో వివిధ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాంకింగ్ ఆర్థిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా గురువారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు 'కాస్వర్డ్ ఈవెంట్' నిర్వహించారు. దీనిలో 64 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎల్‌డీఎం శ్యాంబాబు బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈవెంట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు యూనియన్ బ్యాంకు వారు బహుమతులు అందజేశారు.

గ్రామీణ ఉద్యాన సాగుపై రైతులకు అవగాహన

ఆలమూరు: మండలంలోని చెముడులంక, బడుగువానిలంక గ్రామాల్లో ఉద్యాన రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలోని వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ హార్టికల్చర్ నాలుగో సంవత్సరం చదువుతున్న 16 మంది విద్యార్థులు గత రెండు రోజుల నుంచి మండలంలో పర్యటించారు. అంబాజీపేట కొబ్బరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎన్‌బీవీ చలపతిరావు ఈ బృందానికి నాయకత్వం వహించగా సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, దూలం వెంకటలక్ష్మి సహాయ సహకారాలను అందించారు. విద్యార్థులు ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతుల వద్దకు వెళ్లి సూచనలు, సలహాలు అందజేశారు. గ్రామీణ రైతులు అవలంబిస్తున్న వినూత్న పద్ధతులను తెలుసుకున్నారు. శాస్త్రవేత్తలు వి.గోవర్ధన్‌రావు, ఎం.కల్పన, ఉద్యాన అధికారి జి.కోటేశ్వరరావు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ ద్వారా అద్భుత విద్యా బోధన

మలికిపురం: తరగతి గదిలో అధ్యయనంతో పాటు అంతర్జాలం ద్వారా అద్భుతమైన విద్యా బోధనా అవకాశాలు అపారంగా ఉన్నాయని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి కె.జగదీష్ పేర్కొన్నారు. మలికిపురం కళాశాలలో లైబ్రరీ విభాగం ఏర్పాటు చేసిన గెస్ట్ లెక్చర్‌లో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆధునిక బోధనా ప్రక్రియలో ఎన్–లిస్ట్, స్వయం, మూక్స్, ఎన్‌డీఎల్ తదితర సాధనాల ద్వారా అంతర్జాతీయ స్థాయి కోర్సులను ఉచితంగా ఇంటి వద్ద నుంచే చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోరం సతీష్, ఆనంద మహాని, లైబ్రరీ విభాగాధిపతి మల్లికార్జునరావు, విజయ్, చిట్టాల సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్–బి పోస్టులపై నిర్ణయం తీసుకోవాలి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్‌లో ఖాళీగా ఉన్న గ్రూప్–బి పోస్టులకు సంబంధించి ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో నిరాశతో ఉన్నామని గురువారం పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల శాఖలో టెక్నికల్ ఆఫీసర్, అగ్రికల్చర్ శాఖలోని అగ్రికల్చర్ ఆఫీసర్, పోలీస్ శాఖలోని ఎస్‌ఐ తదితర పోస్టులకు 2023లో దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటివరకూ రాత పరీక్ష నిర్వహించలేదన్నారు. దీంతో వేలాదిమంది యువత రాత పరీక్ష కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి గ్రూప్–బి పోస్టుల నియామకాలను జరపాలని కోరుతున్నారు.

గుత్తుల కుటుంబానికి మల్లాడి పరామర్శ

తాళ్లరేవు: పితృ వియోగంతో బాధపడుతున్న సీనియర్ పాత్రికేయుడు గుత్తుల మల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గురువారం పరామర్శించారు. మల్లేశ్వరరావు తండ్రి ఇటీవల మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను మల్లాడి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, కోరంగి మాజీ సర్పంచ్ బర్రే లక్ష్మీనరసింహరాజు తదితరులున్నారు.

అబ్బురపరిచిన మినీ టోర్నడో



యానాం బైపాస్‌లో కనిపించిన మినీ టోర్నడో

యానాం: పట్టణంలోని బైపాస్ సెంటర్‌లో గురువారం చిన్నపాటి టోర్నడో(సుడి గాలి) అందరినీ అబ్బుర పరిచింది. ఒక్కసారిగా సుడిగాలి రేగి అక్కడ ఉన్న చెత్తను, ధూళిని తనలో ఇముడ్చుకుని గింగిరాలు తిరుగుతూ గాల్లోకి తేలిపోయింది. అటుగా వెళుతున్న పాదచారులు, వాహనదారులు సుడిగాలి విన్యాసాన్ని ఫోన్‌లో బంధించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో అది చక్కర్లు కొట్టింది. మూడేళ్ల క్రితం పరంపేట, అయ్యన్ననగర్‌లో సుడిగాలి బీభత్సాన్ని ఈ సందర్భంగా స్థానికులు గుర్తు చేసుకున్నారు.

విశ్రాంత జీవితం సుఖవంతం కావాలి



పదవీ విరమణ చేసిన అలీని సత్కరిస్తున్న డీఐపీఆర్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు

ముమ్మిడివరం: పదవీ విరమణ చేసిన డీపీఆర్‌ఓ ఎండీ విలాయత్ అలీ విశ్రాంత జీవితం సుఖవంతం కావాలని జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి కె.లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద డీపీఆర్‌ఓ కార్యాలయంలో గురువారం పదవీ విరమణ చేసిన అలీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి, కె.భారతి, శార్వాణి, ఆర్ఎస్ కుమార్, ఎన్.చిట్టిరాజు, ఎం.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అల్లవరం: పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ అధ్యక్షతన పల్స్‌పోలియోపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 4,032 మంది ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించామని, వీరికి మార్చి 3న పోలియో చుక్కలను పంపిణీ చేస్తామన్నారు. పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు, ఆశ, వైద్య సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు బాల సుబ్రహ్మణ్యం, స్పందన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో 155 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీసెస్ డైరెక్టర్ జి.శ్రీరాములు నోటిఫికేషన్ జారీ చేశారు. పుదుచ్చేరి, కారైకల్ రీజియన్(తమిళ భాష ప్రావీణ్యత)కు 136 పోస్టులు, మాహే రీజియన్(మళయాళ భాష ప్రావీణ్యత)కు 18 పోస్టులు, యానాం(తెలుగు భాషా ప్రావీణ్యత) 1 పోస్టు కేటాయించారు. మొత్తంగా జనరల్–64, ఓబీసీ–17, బీసీఎం–3, ఎంబీసీ–28, ఈబీసీ–3, ఎస్సీ–24, ఎస్టీ–1, ఈడబ్ల్యూఎస్–15, పీడబ్ల్యూబీడీ–6 పోస్టులు కేటాయించారు. అయితే రీజియన్ వారీగా నర్సింగ్ పోస్టుల కేటాయింపుతో యానాం అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యువత ఓటు హక్కుని వినియోగించుకోవాలి

అల్లవరం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో యువత ఓటు హక్కుని వినియోగించుకుని ప్రధాన భూమిక వహించాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే అంశంపై కళాజాత కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నేత డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, ఉప్పుగంటి భాస్కరరావు, డాక్టర్ టీవీ జనార్ధనరావు, ఆర్.రాజేష్ పాల్గొన్నారు.